క్లుప్తంగా

ఘన స్వాగతం పలుకుదాం

సత్తుపల్లి: టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారి సత్తుపల్లికి వస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం పలకాలని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు కొండూరి సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం 3 గంటలకు సత్తుపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా బయలు దేరి సిద్దారం రోడ్‌లోని శ్రీ లక్ష్మి ప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరిగే సభకు పొంగులేటి చేరుకుంటారన్నారు. కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ ముత్తారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుజలరాణి, పద్మాజ్యోతిరెడ్డి, అప్పారావు, పూర్ణచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణ, కృష్ణారెడ్డి, బాబురావు, కొటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన వైరా సీఐ



రికార్డులను తనిఖీ చేస్తున్న వైరా సీఐ సాగర్

చింతకాని: వైరా సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.సాగర్ చింతకాని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరితో ఫ్రెండ్లీగా ఉంటూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. అనంతరం పలు రికార్డులు, రిజిష్టర్లను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని ప్రతి రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ చౌదరి, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు మల్సూర్, శ్రీనివాసరావు, బ్లూకోల్ట్ కానిస్టేబుల్ గుంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న శేఖర్ గౌడ్

వైరా: కిసాన్ కాంగ్రెస్‌ను గ్రామ స్థాయినుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వైరాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు రైతులు, రైతు కూలీల పట్ల వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టి ప్రజలకు వివరించడానికి కార్యకర్తలు కంకణ బద్ధులై పని చేయాలన్నారు. ఈ సమావేశంలో కిసాన్ ఖేత్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంటిముక్కుల నాగేశ్వరరావు, నాయకులు వెంకటనర్సిరెడ్డి, పుల్లయ్య, సీతారాములు, కృష్ణారావు, హరినాథ్, రాము, కొండలు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేయాలి



బాబు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముదిగొండ: కోయ బాబు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ అన్నారు. మండలంలోని అమ్మపేటలో కోయబాబు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బాబు స్థూపం వద్ద నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ, నాయకులు రవికుమార్, వెంకన్న, వెంకటేశ్వర్లు, చింటు, వెంకటరమణ, పుల్లయ్య, గురవయ్య, బాబులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఘన నివాళి

కొణిజర్ల: మండల కేంద్రం కొణిజర్ల మాజీ సర్పంచ్ సీపీఐ సీనియర్ నాయకుడు బండారు హన్మంతు ద్వితీయ వర్ధంతి కొణిజర్లలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు ఆయన స్మారక స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, స్వర్ణ రమేష్, బీఆర్‌ఎస్ నాయకుడు బాబు, సీపీఐ నాయకులు పుల్లయ్య, సీతారాములు, శ్రీను, సోమయ్య, వీరన్న, నాగమణి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‘పవర్’.. కొరత!

- విద్యుత్ సబ్‌స్టేషన్లలో సిబ్బంది కొరత
- ఏళ్లు గడుస్తున్నా ఇదే తంతు
- పనిభారంతో సతమతం
- కొరవడిన పర్యవేక్షణ



కల్లూరు సబ్‌స్టేషన్

విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. పనులు చేసే సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లైన్‌మెన్లు, అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ లైన్‌మెన్లు మండలంలో సరిపడనంతగా లేరు. దీంతో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు, మరమ్మతులు, పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

కల్లూరురూరల్: మండలంలో కల్లూరు, బత్తుల పల్లి, పెద్దకోరుకొండిలలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ మూడు స్టేషన్‌ల నుంచి గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. మండలంలోని పలుగ్రామాలలో సిబ్బంది లేకపోవటంతో విద్యుత్ అంతరాయం కలిగిన సమయంలో మరమ్మతుల చేయడంలో ఆలస్యం ఏర్పడుతుంది. దీంతో పలుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీనికి తోడు ఉన్న సిబ్బందిపై అదనపు పనిభారం పడడంతో వారు సతమతమవుతున్నారు.

సబ్‌స్టేషన్లలో ఖాళీగా ఉద్యోగాలు..

బత్తులపల్లి సెక్షన్లో 12మంది ఆపరేటర్లు ఉండాల్సి ఉండగా కేవలం 8మంది మాత్రమే ఉన్నారు. నాలుగు ఆపరేటర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా కల్లూరు, పెద్దకోరుకొండి సెక్షన్లలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎల్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా విద్యుత్ ఉపకేంద్రాల్లో టెక్నికల్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. దీని కారణంగా విద్యుత్ సరఫరా చేయడంలో పలు అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో పలు గ్రామాల్లోని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పనిభారంతో సిబ్బంది అవస్థలు..

మండలంలో సిబ్బంది కొరత కారణంగా ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరుగుతోంది. వర్షాకాలం, ఈదురుగాలుల సమయంలో సిబ్బంది పడే బాధలు వర్ణనాతీతం. తరచూ విద్యుత్ సరఫరాలో అతరాయం కలుగుతూ.. ఉండడంతో మరమ్మతుల చేసేందుకు ఆలస్యం అవుతుంది. పలు చోట్ల సిబ్బంది కొరత వలన కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

అంతరాయం కలగనివ్వొద్దు..



వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి. వర్షాలు, గాలులు వలన స్తంభాలు ఒరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సత్వరమే సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను కొనసాగించాలి.

– మండేపుడి బసవయ్య, లోకవరం

సిబ్బందిని నియమించాలి..



కల్లూరు మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి. ముఖ్యంగా జూనియర్ లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలి. సిబ్బంది కొరత ఉంటే తాత్కలికంగా సిబ్బందిని నియమించి, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.

– వాసిన్ని నారాయణరావు, పుల్లయ్య బంజరు

అధికారులకు తెలియజేశాం..

కల్లూరు మండలంలోని పెద్ద కోరుకొండి, కల్లూరు, బత్తులపల్లి సబ్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. కొరత ఉన్నప్పటికీ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. సిబ్బంది ఖాళీల గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. గ్రామాలతో పాటుగా వ్యవసాయదారులకు కూడా విద్యుత్‌లో అంతరాయం కలగకుండా చూస్తున్నాం.

– గణేష్, ఏఈ, కల్లూరు

రానున్న ఎన్నికల్లో విజయం ఖాయం



కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తున్న దయానంద్

తల్లాడ: సీఎం కేసీఆర్ చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని మట్టా దయానంద్ అన్నారు. శుక్రవారం తల్లాడలోని ఎన్టీఆర్‌నగర్‌లో ప్రజలను ఆయన కలుసుకొని కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలిచి వారి సంక్షేమం కోసం కృషిచేసిన పార్టీ కాంగ్రెస్ మాత్రమే అన్నారు. తెలంగాణ ప్రజల చిరకాల కోరికను గ్రహించిన సోనియాగాంధీ తెలంగాణను ప్రకటించారన్నారు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు న్యాయం జరగలేదని, గిరిజనుల సంక్షేమం ఏమైందని ప్రశ్నించారు. అనంతరం తల్లాడ ఎంపీటీసీ చల్లా తిరుమలదేవి, ఆమె భర్త చల్లా నాగులును పరామర్శించారు. అందలం విశ్వనాథం భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దగ్గుల నాగిరెడ్డి, దుండేటి వీరారెడ్డి, ప్రసాద్, దొడ్డా శ్రీనివాసరావు, జోసఫ్, వేమిశెట్టి నాగన్న, వడ్డే రామారావు, పుల్లయ్య, నాగుల్‌మీరా, సిల్వ రాజు, నాగరాజు, అప్పలర్‌రాజు, వెంకన్న పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



మాట్లాడుతున్న డాక్టర్ కాపా మురళీ కృష్ణ

వైరా: వైరా లయన్స్‌క్లబ్ ద్వారా 2022–23లో నిర్వహించిన సేవా కార్యక్రమాల వల్లనే జిల్లాలో మంచి గుర్తింపు లభించినదని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో క్లబ్ అధ్యక్షుడు పెనగొండ ఉపేందర్‌రావు అధ్యక్షతన అవార్డు గ్రహీతల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డులు పొందిన వీడీజీ–2 నంబూరి మధు, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంబాబు, బెస్ట్ జోన్ చైర్మన్ అవార్డు అందుకున్న లగడపాటి ప్రభాకర్‌రావు, ఉత్తమ అధ్యక్షుడి అవార్డు అందుకున్న చింతోజు నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. లయన్స్‌క్లబ్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు అబ్బూరి రమేష్, చింతలపూడి కోటేశ్వరరావు, నూకల ప్రసాద్, వాసు, చక్రవర్తి, సత్యం బాబు, నాగేశ్వరరావు, సుబ్బారావు, రాజారావు, నీరజ, రాంబాబు, మహేశ్వరరెడ్డి, సీత, హనుమాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



మధిర: తొట్టిలో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది



కల్లూరు రూరల్‌లో..

మధిర/సత్తుపల్లిటౌన్/కల్లూరురూరల్: దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారామెడికల్ సిబ్బంది గ్రామాల్లో, పట్టణంలోని పలు ప్రాంతాల్లో తిరిగి ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దెందుకూరు, ఖమ్మంపాడు, మహాదేవపురం, మడుపల్లి, మధిర–1, 2 సబ్ సెంటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాల్లో వైద్య బృందం పర్యటించింది. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా సత్తుపల్లిలోని గంగారం పీహెచ్‌సీ వైద్యుడు ఆధ్వర్యంలో సిబ్బంది, కల్లూరులోని సిబ్బంది పలు గ్రామాల్లో ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాబుల్లో, ట్యాంకుల్లో, టైర్లలో, కూలర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగింపజేశారు. ఈ కార్యక్రమాలల్లో వైద్య సిబ్బంది సనప గోవింద్, సుబ్బలక్ష్మి, లంకా కొండయ్య, జయమ్మ, విజయ కుమారి, భారతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కరుణాకర్‌రెడ్డి



బాధ్యతలు చేపడుతున్న కరుణాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీ టి.కరుణాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ డి.తిరుమలాచారి ఇటీవల మెడికల్ లీవ్‌పై సెలవులో ఉండడంతో రిజిస్ట్రేషన్లతో పాటు పలు సమస్యలు పెండింగ్ ఉండడంతో కలెక్టర్ గౌతమ్ స్పందించి డీటీ కరుణాకర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

కొనసాగుతున్న నిరసనలు..



కారేపల్లి: దుకాణంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు



బోనకల్ : నిరసనలో జీపీ కార్మికులు

వైరారూరల్/కారేపల్లి/బోనకల్: జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరింది. వైరా, కారేపల్లి, బోనకల్ మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్నారు. ఈ సదర్భంగా కార్మికులు పలుచోట్ల కల్లకు గంతలతో, భిక్షాటన చేస్తూ.. వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే దీక్షలను విరమించేది లేదని స్పష్టం చేశారు. జీపీ కార్మికులకు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో సీఐటీయూ నాయకులు కె.నరేందర్, వజ్జా రామారావు, ఎన్డీ నాయకులు వై.ప్రకాశ్, ఎన్‌వీ రాకేష్, జీపీ వర్కర్లు హుస్సేన్, గౌతమ్, కోటి, శ్రీను, ఆ సంఘం మండల అధ్యక్షులు అంతోటి రమేష్, సైదులు, వెంకటేశ్వర్లు, రాము, ప్రకాశం, వెంకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటికి ఘన సన్మానం

కల్లూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, సుధాకర్, అచ్చుతరావు, కృష్ణార్జున రావు, నాగేశ్వరరావు, రమేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది



మేదేపల్లిలో సర్వే చేస్తున్న తహసీల్దార్ ముజాహిద్

ఏన్కూరు: ఓటు వేయలంటే 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని గిరిజనులు తహసీల్దార్ ముజాహిద్‌తో మొరపెట్టుకున్నారు. మండలంలోని కొత్తమేడేపల్లి గ్రామాన్ని తహసీల్దార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఇళ్లులు, ఓటర్ల వివరాలను గ్రామపెద్ద గంగరాజును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 52 గృహాలు ఉన్నాయని, 118 ఓటర్లు ఉన్నారని వీరంతా ఓటు వేయడానికి సుమారు 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. స్పందించిన తహసీల్దార్ ఈ విషయాన్ని ఉన్నాతాధికారులు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, బీఎల్ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

జంతు ప్రేమను చాటుకున్న సీఐ

సత్తుపల్లిటౌన్: పోలీస్ స్టేషన్‌లో చాలా రోజులుగా సంచరిస్తూ అనారోగ్యం బారిన పడిన శునకానికి సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్ వైద్యం చేయించి జంతు ప్రేమను చాటుకున్నారు. అయితే శుక్రవారం ఆ శునకం మృతి చెందటంతో అంత్యక్రియలు నిర్వహించారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం



మధిర: సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర/చింతకాని: అన్ని వర్గాల ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మధిర మండలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్ర వారం పలు గ్రామాలకు చెందిన 22 సీఎంఆర్ఎఫ్ చెక్కులకు సంబంధించిన రూ.6.73 లక్షలను లబ్ధిదారులకు అందించారు. అదే విధంగా చింతకాని చెందిన షేక్ రంజాన్ మృతి చెందడంతో బీఆర్ఎస్ పార్టీ రూ.2 లక్షల బీమా చెక్కును అతని భార్య లాల్‌బీకి అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు, నాయకులు శ్రీనివాసరావు, భాస్కర్ రెడ్డి, వైవీ అప్పారావు, వైస్ ఎంపీపీ హనుమంతురావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ రత్నాకర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు గోపయ్య, తిరపయ్య, షబ్బీర్‌ఖాన్, జానిమియా, బాబురావు, శ్రీను, నాగిలిగొండ ఎంపీటీసీ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఆగంతకులను శిక్షించాలి



సత్తుపల్లి: కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న మానవతారాయ్, తదితరులు



ముదిగొండలో..

సత్తుపల్లి/వేంసూరు/తల్లాడ: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన, అత్యాచారానికి పాల్పడిన ఆగంతకులను కఠినంగా శిక్షించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ లు అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలో బీజేపీ పాలనను నిరసిస్తూ కళ్లకు రిబ్బన్ కట్టుకొని, వేంసూరులో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తల్లాడలోని మల్సూర్ తండాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యావత్ భారత దేశానికి మాయని మచ్చగా ఈ ఘటన మిగిలిపోతుందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సాదు శరత్‌బాబు, బోందల యాకోబ్, డంకర శ్రీను, తుంగా శేషయ్య, మోదుగు కాంతయ్య, సుహాసిని వీర కృష్ణ, సృజన, కాంగ్రెస్ నాయకులు రావి నాగేశ్వరరావు, బాబా, కాంతారావు, ఏడుకొండలు, బార్లి, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మధిర/ముదిగొండ/బోనకల్: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ముదిగొండలో సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, బోనకల్‌లోని రావినూతల గ్రామంలో ఐద్వా మండల ఉపాధ్యక్షురాలు గుగులోత్ శారద ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాటాడుతూ.. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూ టీఎఫ్ డివిజన్ నాయకుడు నాగరాజు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకుడు ఆంజనేయులు, మీరాఖాన్, సాంబయ్య, కస్తూరిబా, రాణి, సాదు, భాస్కర్‌రావు, చెన్నయ్య, రమేష్, రాజు, మహేంద్ర కుమార్, భూలక్ష్మి, సుజాత, హసీనాబేగం, విజయలక్ష్మి, స్వాతి, సుల్తానా, సుర్యనారాయణ, బుచ్చిబాబు, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు మందరపు పద్మ, ప్రభావతి, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి సతీష్, వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి భద్రయ్య, నాయకులు నాగేశ్వరరావు, సాయిరాం, సరోజిని, ఐద్వా నాయకులు ధరావత్ సునీత, అచ్చమ్మ, బుజ్జి, లక్ష్మి, భారతి, మంగా, సరోజ, ఆదెమ్మ, గిరిజన సంఘం నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: మణిపూర్ మారణహోమానికి ప్రధాన మంత్రి బాధ్యత వహించాలి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఖమ్మం జిల్లా నాయకుడు ఎస్‌కే లాల్ మియా డిమాండ్ చేశారు. మండలంలోని రాజలింగాలలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా అధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, రాధలక్ష్మి, వెంకటలక్ష్మి, పుల్లయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



కల్లూరురూరల్: కేక్‌కట్‌చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సత్తుపల్లి: కేక్ కట్ చేస్తున్న మువ్వా విజయ్‌బాబు, కొండూరి సుధాకర్



వైరా: కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎర్రుపాలెంలో..

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్/వైరా/ఎర్రుపాలెం/కల్లూరురూరల్: ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరాలో టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, పీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్‌లు కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అదే విధంగా సత్తుపల్లిలోని కొండూరి సుధాకర్ నివాసరంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ రాగమయి లు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎర్రుపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిలు కేక్ కట్‌చేసి ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఎల్పీనేత భట్టి కృషితో మంజూరైన సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 1,18,500 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కల్లూరులో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోవు రాజ్యం ఇందిరమ్మ రాజ్యమేనని సోనియాగాంధీ నేతృత్వంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీల సారధ్యంలో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ గౌడ్, నాయకులు వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, సంతోష్, నాగరాజు, నాగేశ్వరరావు, హరినాథ్, వేణు, హన్మంతరావు, రంగారావు, పుల్లయ్య అశోక్, పీసీసీ సభ్యుడు ప్రతాపరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, జానీభాషా, లక్ష్మణరావు, వెంకట నరసయ్య, పిచ్చిరెడ్డి, రాజీవ్ గాంధీ వెంకటరామిరెడ్డి, ఉమా మహేశ్వరి, బాబురావు, నారాయణ, జనార్దన్, నాగబాబు, నర్సిరెడ్డి, అనీల్ కుమార్, ముస్లిం, క్రైస్తవ మతపెద్దలు కరుణాకర్, జాబిర్‌ఖాన్, అలీం, నాయకులు కమల్‌పాషా, శ్రీనివాసరావు, చెన్నారావు, రఫీ, యూనిస్, సందీప్, జిల్లా నాయకులు మువ్వా విజయ్‌బాబు, సుధాకర్, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరావు, జనార్దన్, కిరణ్, లోకేశ్వరావు, కృష్ణారెడ్డి, సత్యంబాబు, తురాబ్ అలీ, ఉస్మాన్ పాల్గొన్నారు.



పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

గత నాలుగు రోజులగా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. చేతి వృత్తిదారులు, దినసరి కూలీలు తమ రోజు వారి పనులను మానుకొని ఇళ్లకే పరిమితమయ్యారు. అదే విధంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువుల్లో వర్షపు నీరు చేరింది. మెట్ట భూముల్లో పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్న రైతులకు వర్షం ఊరట కలిగించింది.

– వైరారూరల్